నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 9-10-2025

## 100కు 100 మార్కులు!

ఈ లోకంలో ఏ కాల పరిస్థితుల్లోనైనా
నువ్వు ఎక్కువగా సంపాదించకుంటే
నీకు అవసరమున్నంత డబ్బులేకుంటే
ఎట్టి పరిస్థితిల్లో నువ్వొక మంచి భర్తగా
మంచి తండ్రిగా మంచి కొడుకుగా
మంచి అన్నగా, మంచి నాయకునిగా
మంచి స్నేహితునిగా, మంచి ప్రేమికునిగా
ఆఖరకు మంచి మనిషిగా కూడా కాలేవు!
నీకు సంపద, సంపాదన లేకుంటే నువ్వొక
అక్కరకురాని తుప్పుపట్టిన ఇనుపముక్కవే
నిరుపయోగపు నిస్సారమైన సజీవ ప్రాణివే
నీ దగ్గర డబ్బుంటే అందరిలో చిరునవ్వులే
నీ గతమెలా ఉన్నా అంతటా సుస్వాగతాలే
అన్ని అనుబంధాల్లో 100కు 100 మార్కులే!



– డా॥ డి. రాజేశ్
9440460490

# బానిస సంకెళ్లు

శరీరానికి సంకెళ్లు వేసి బంధించడం పాతకాలం నాటి మనిషి అనుభవించిన బానిసత్వం. కానీ నేటి మానవుడు అనుభవిస్తున్న బానిసత్వం బయటికి కనపడనిది, లోతైనది. అది మనిషి మనస్సులో, ప్రవర్తనలో, దైనందిన జీవన విధానంలో మమేకమై కూరుకుపోయి ఉంది. నేటి ప్రతి మనిషి అనుకుంటాడు.. తాను ఒక స్వేచ్ఛావంతుడనని, తన ఇష్ట ప్రకారమే జీవిస్తున్నానని. కానీ తనకు తెలియకుండానే ఎన్నో అలవాట్లకు, వస్తువులకు, ఉద్వేగాలకు బానిసై పోయాడని లోతుగా పరిశీలిస్తే బోధపడుతుంది. అవన్నీ బయటికి కనపడని మానసిక సంకెళు. ప్రతి బంధం ఒక బంధనం.. వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రతిబంధకం.

### అలవాట్ల బానిసత్వం

మనిషి జీవన విధానాన్ని తీర్చిదిద్దేది అలవాటు. రెండు వైపుల పదును గల కత్తిలాంటి శక్తి అది. అలవాట్లు స్వభావంలో మంచివి, చెడువి అంటూ ఉండవు, అవి మనిషిని ఏ దిశలో నడిపిస్తాయనేది కీలకం. స్వేచ్ఛ మనిషికి ఒక వరమైతే ఆ వరాన్నే క్రమంగా కబళించే గుణం అలవాటుకు ఉంటుంది. ఆ క్రమంలో మనిషి తనకు తెలియకుండానే యాంత్రికంగా మారిపోతాడు. యాంత్రికత బానిసత్వానికి మరో రూపు అనడంలో సందేహం లేదు. ఒకసారి చేరదీస్తే అలవాట్లు ఊరకే పోవు. ఇందులో కొన్ని మొదట సంతోషాన్ని కలిగిస్తాయి, కానీ తరువాత బంధిస్తాయి. సెల్ ఫోన్, సోషల్ మీడియా లాంటి వాటికి అలవాటుపడితే, అవి లేని క్షణం భరించలేని స్థితికి చేరినప్పుడు, మనిషి స్వేచ్ఛా జీవి కాదు, బానిసే అవుతాడు.

సమాజం మనిషిని కొన్నిసార్లు చీకట్లోకి నడిపిస్తుంది. మద్యం, మత్తు పదార్థాలు, జూదం, అవినీతి, అహంకారం.. ఇవన్నీ మనిషి వ్యక్తిత్వాన్ని క్రమంగా దిగజార్చేవే. ఇవి ఆత్మజ్ఞానానికి అవరోధాలు కూడా. ఈ దురలవాట్లకు బానిసైన వారికి అంత సులభంగా విముక్తి లభించదు. అంతే కాక వారు కుటుంబానికి, సమాజానికి భారంగా మారి గౌరవాన్ని కోల్పోతారు. క్రమంగా ఓపికను కూడా కోల్పోయి కోపానికి బానిసవుతారు. మనిషికి సహనం, ఓర్పు బలహీనతలు కావు, నిజానికి ఇవే మానవత్వానికి గీటు రాళ్లు. ఇతరులను కించపరచడం, హేళనతో ఎగతాళి చేయడం కూడా ఒక రకమైన బానిసత్వపు

> “మద్యం, మత్తు పదార్థాలు, జూదం, అవినీతి, అహంకారం.. ఇవన్నీ మనిషి వ్యక్తిత్వాన్ని క్రమంగా దిగజార్చేవే”

కోవలోకే వస్తాయి. ప్రతి మనిషిలో లోపాలు ఉండడం సహజం. వాటిని ఎత్తిచూపడం కన్నా, ఆ మనిషిలో ఉన్న మంచిని చూడగలగడం గొప్పతనం.

గౌతమ బుద్ధుడు చెప్పినట్లు.. ‘మనిషి తాను ఆలోచించినట్టే అవుతాడు.’ అలవాటు అనేది మనిషి అంతర్గత స్వభావానికి అద్దం పడుతుంది. ఏ అలవాటైనా మనిషి నియంత్రణలో ఉంటే, జీవితం అతని స్వాధీనంలో ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఆ అలవాట్లే మనిషిని నియంత్రిస్తే జీవితం స్వేచ్ఛ కోల్పోతుంది.

### అనవసరమైన కోరికల బానిసత్వం

ప్రతి మనిషి జీవితం ఓ కోరికల గాథ. కోరికలు లేకుండా ముందుకు సాగదు. అవసరాన్ని బట్టి కొన్ని కోరుకోవడం సహజం. అవి జీవన క్రమాన్ని నడిపించే కోరికలు.. గమ్యం చేరుకోవడానికి సహకరించేవే కానీ ఎలాంటి బంధనాలు కావు. దీనికి భిన్నంగా, చిన్న చిన్న గుట్టలు ఎక్కే సత్తా లేకున్నా ఏకంగా ఎవరెస్టునే ఎక్కాలనుకోవడం గొంతెమ్మ కోరికే అవుతుంది. ఇలాంటి అందని వాటి కొరకు అర్రులు చాచడం, తీరని ఆకాంక్షల వెనక పరుగెత్తడం ప్రతి మనిషికీ ఉన్న వెర్రి.

అలవాటు లాగే కోరిక కూడా ఓ అంతర్గత శక్తి. అది సరైన దిశలో ఉంటే శ్రేయస్సుకు దారితీస్తుంది. కానీ అవసరం అనే హద్దులు దాటి అనవసరంగా మారితేనే తంటా. మనిషి ఈ సరిహద్దును గుర్తించలేక పోయినప్పుడే బానిసత్వానికి బీజం పడుతుంది.

ఇంకా ఏదో కావాలనే తపనలో పడిపోయిన మనిషిని అనవసర మైన కోరికల బానిసగా మార్చుతుంది. మోహమా, మోసమా అనే మీమాంసలో పడి కొట్టుమిట్టాడతాడు మనిషి. ఎన్ని నదులు చేరినా నిండని సముద్రం లాంటివి కోరికలు. ఈ కోరికలే క్రోధానికి, సర్వ దుఃఖాలకు మూలమని, వాటిని జయించిన వారే శాంతిని పొందుతారని భగవద్గీత బోధిస్తుంది. అవసరం మేరకు ఉండే కోరికలు జీవన క్రమాన్ని తీర్చిదిద్దుకుంటూ మానవత్వాన్ని పెంపొందించుకోవడంలో తోడ్పడతాయి. అనవసరమైనవి మాత్రం మనిషిని బానిసత్వపు అడుసులోకి తోసేస్తాయి.

### బంధాల్లో బానిసత్వం

పుట్టిన క్షణం నుండి మనిషికి బంధాల ‘వల’ చుట్టుకుంటుంది. తొలుత ఈ బంధాలు ప్రేమ, అనురాగం, ఆనందం, భద్రత కలిగించినా, కాలక్రమేణా అవి హద్దులు దాటితే మనిషిని బానిసత్వపు సుడిలోకి నెడుతూ స్వేచ్ఛా జీవనానికి అడ్డుగోడలుగా మారతాయి. బంధం లేని జీవితం మనిషికి ఎడారిలా అనిపిస్తుంది, కానీ ఆ బంధమే తన ఆత్మ స్వరూపాన్ని మరచిపోయేలా చేసి బాధ్యతల భారాన్ని మోపుతుంది. మనిషి అస్తిత్వానికి మూలం స్వేచ్ఛ. కానీ కుటుంబం, సమాజం, సంప్రదాయం లాంటి బంధన వలయాలు అతని స్వేచ్ఛను క్రమక్రమంగా హరిస్తాయి. చివరికి అతనిని నిత్యం ఈ బంధాల బలిపీఠం మీద నిలబెడుతూ అసలైన బానిసత్వాన్ని రుచి చూపిస్తాయి. ప్రతి బంధంలో ప్రేమ ఉంటుంది, కానీ దాని వెనక ఉన్న స్వార్థపు ఛాయ, స్వాధీనత ఆకాంక్ష (ఓనర్షిప్ రైట్!) ఆ మనిషిని బానిసత్వపు బంధంలోకి తోసేస్తుంది.

బంధాలు లేకుండా జీవితం వెలితిగా ఉంటుంది. కానీ ఆ బంధాలకు బానిసైతే, జీవితం బరువైన గొలుసులతో కట్టడి చేయబడుతుంది. బంధం అనేది స్వేచ్ఛను పంచుకునే శక్తి కావాలి కానీ స్వేచ్ఛకు ఉచ్చు వేసే ఉరితాడు కాకూడదు. తాత్వికంగా పరిశీలిస్తే బంధాలన్నీ మనిషి అంతర్గత స్వేచ్ఛకు పరీక్షా వేదికలే. ‘నాది – నీది’ అనే ద్వంద్వ పరిస్థితుల్లో చిక్కుకుపోతాడు. అలాగని, బంధాలు తెంచుకొని అడవిలోకి పారిపోవడం ‘విముక్తి’ కాదు. బంధాలలోని నిర్బంధాలను దాట గలగడమే నిజమైన విముక్తి. బంధాలను పరిరక్షించుకుంటూ వాటికి బానిసగా మారకుండా ఉండడం. అద్దాల మేడలో నివసిస్తూ రాళ్లు తగలకుండా జాగ్రత్తపడినట్లు, బంధాలలో జీవిస్తూ తన ఆత్మ స్వరూపాన్ని (స్వేచ్ఛను) చెక్కుచెదరనీయకుండా కాపాడుకోవడమే ఒక మహా సాధన. అనుబంధాన్ని అనుభవంగా మార్చుకునే ప్రయత్నం చేయాలి, కానీ ఎట్టి పరిస్థితుల్లో నిర్బంధంగా మారనీయకూడదు.

### భావోద్వేగాల బానిసత్వం

మనసుకు వేసిన సంకెళ్లను తెంచుకోగల సామర్థ్యం ఉన్నవాడే మహానుభావుడు. బయటి సంకెళ్లు తెంచడం సులభం, కానీ మనసు లోపలి సంకెళ్లను తెంచడానికి మహా సాధన చేయాలి. వాటిని తెంచుకోగలిగితే, అది ఇతరులను గెలవడం కన్నా గొప్ప విజయం. అదే అసలైన వీరత్వం. అన్ని రకాల బానిసత్వాల నుంచి విముక్తి పొందినప్పుడే మనిషి నిజమైన స్వేచ్ఛావంతుడు అనిపించుకుంటాడు. మనిషి బయటి ప్రపంచాన్ని జయించినా, తన భావోద్వేగాలను జయించ లేకపోతే అతడు బానిసగానే పరిగణించబడతాడు.

మనిషి హృదయం భావోద్వేగాల క్షేత్రం. ఆనందం, దుఃఖం, కోపం, ప్రేమ, అసూయ, భయం.. ఇవన్నీ ప్రతి మనిషికి జీవన క్రమంలో ఉత్పన్నమయ్యే సహజ సిద్ధమైన భావోద్వేగాలు. సూక్ష్మ కోణంలో పరిశీలిస్తే ఇవే అతి పెద్ద బంధనాలు. మరో వైపు ఇవి లేని జీవితం ఎండిపోయిన మోడులా నిర్జీవంగా ఉంటుంది. కానీ వీటికి బానిసైతే జీవితం ఈ బంధనాల సంకెళ్లను తెంచుకొని స్వేచ్ఛగా సాగలేని స్థితికి దిగజారుతుంది.

> “సంబంధాల లోకంలో జీవించడం మనిషి యొక్క సహజ స్వభావం. ఆలోచనలను, అనుభూతులను, ప్రేమను పంచుకోవడం లాంటివన్నీ మానవత్వపు ధర్మాలు”

భావోద్వేగం ఒక సృజనాత్మక శక్తి. నియంత్రణ కోల్పోయిన మరుక్షణం అది బలహీనతగా మారే ప్రమాదముంది. ఉదాహరణకు, కోపం.. ధర్మ రక్షణకు తోడ్పడే శక్తి, కానీ అది అధికమైతే వినాశనానికి దారి, ప్రేమ.. మానవత్వానికి ఆత్మ, కానీ అది మితిమీరితే పిచ్చి, భయం.. అవసరమైన అప్రమత్తతకు దారి, కానీ ఎక్కువైతే అశక్తిగా మారి పిరికితనానికి దారి తీస్తుంది.

ద్వంద్వ స్వభావ మున్న భావోద్వేగాలను మనిషి తన ఆధీనంలోకి తీసుకోగలిగితే స్వేచ్ఛా మహానుభావు డవుతాడు, లేదా వాటికి దాసోహమై లొంగిపోతే ఏ స్వేచ్ఛకు నోచుకోని కీలుబొమ్మగా మారతాడు.

జ్ఞాని అయినా, యోగి అయినా భావోద్వేగాలు లేనివాడు కాదు, వాటికి బానిసగా మారని వాడు.

భావోద్వేగాలు సహజం, వాటికి బానిస కావడమే అసహజం. మానవ హృదయం ఓ అద్దం లాంటిది. భావోద్వేగాలు ఒక అలలా వచ్చి హృదయాన్ని తాకాలి కానీ చెరిగిపోని గీతలుగా మిగిలిపోకూడదు.

### ఒంటరితనం బానిసత్వమేనా?

సంబంధాల లోకంలో జీవించడం మనిషి యొక్క సహజ స్వభావం. ఆలోచనలను, అనుభూతులను, ప్రేమను పంచుకోవడం లాంటివన్నీ మానవత్వపు ధర్మాలు. ఈ నేపథ్యంలో ఒంటరితనం అనేది ఒక వింత అనుభవం. అయినా ఒంటరిగా ఉండడం తప్పు కాదు. అప్పుడప్పుడు అది ఆత్మ పరిశీలనకు, సృజనాత్మకతకు పురికొల్పుతుంది. కానీ తరచూ ఒంటరితనంలో బందీ కావడం అలవాటైతే అది ఒక రకమైన బానిసత్వమే. బయట ప్రపంచంతో అనుబంధాన్ని కోల్పోవడమే. ఒంటరితనం స్వచ్ఛందమైతే ఆత్మజ్ఞానానికి, బలవంతమైతే బానిసత్వానికి దారి తీస్తుంది. బానిసత్వంగా మారకుండా ఉండాలంటే.. దానిని మనిషి తన నియంత్రణలో ఉంచుకోవాలి

### అష్టదిగ్బంధనంలో మనిషి!

మనిషి నేడు అన్ని రకాల దిగ్బంధనంలో చిక్కుకునే స్థితికి చేరుకున్నాడు. ఇది ఆధునికత మాయాజాల ప్రభావమే. మనస్సులో, అలవాట్లలోనే కాక మనిషి ఎన్నో ఆధునిక సాంకేతిక సంకెళ్లకూ (సిలికాన్ చిప్ లకు) బందీ అయ్యాడు. సౌకర్యం లేదా సౌలభ్యం కొరకు వచ్చిన మొబైల్ ఫోన్ ఈ రోజు, ‘మనిషి ఫోన్ ను పట్టుకున్నాడా లేక ఆ ఫోన్ మనిషిని పట్టుకుందా?’ అన్నంతగా జీవన బంధనంగా మారింది. సెల్ ఫోన్ లేకుండా ఒక రోజు గడపలేని స్థితికి దిగజారాడు. అలాగే కంప్యూటర్, ఇంటర్నెట్, సోషల్ మీడియా, టీవీ, డిజిటల్ గేమ్స్.. వీటన్నిటికీ అతుక్కొని వర్చువల్ లోకంలో తేలిపోతూ వాస్తవ ప్రపంచాన్నే మరిచిపోతున్నాడు. వీటిని వాడడం తప్పు కాదు, కానీ వాటికి వశుడైపోవడం తప్పు. ‘డిజిటల్ తెర’ (స్క్రీన్) బానిసత్వానికి లోను కాకూడదు. ఈ ‘తెర’ మొదట్లో ఒక ‘కిటికీ’ లాగ వచ్చి, ప్రపంచాన్నే మన కళ్ల ముందుకు తెచ్చింది. ఇప్పుడు అదే కిటికీ మన కళ్లకు గంతలుగా మారింది. స్వేచ్ఛా జీవితం అంటే ఏ వస్తువులు

> “మనిషి తనకు తెలియకుండా అనవసరమైన వాటికెన్నింటికో బానిసగా మారుతున్నాడు. ఆ క్రమంలోనే నిజమైన స్వేచ్ఛకు దూరమవుతున్నాడు”

లేకుండా జీవించడం కాదు; అవి లేకున్నా ప్రశాంతంగా జీవించడం.

సాంకేతికత మానవ మేధ ఆవిష్కరించిన ఒక అద్భుతం.. మానవ జాతికి వరం. అది దారి చూపించాలి కానీ దారి మళ్లించకూడదు. సాంకేతికత మనిషి కోసం పుట్టింది, మనిషి సాంకేతికత కోసం పుట్టలేదు. అందుకే అది ఎప్పుడూ మనిషి కట్టడిలోనే ఉండాలి, దాని కట్టడిలో మనిషి కాదు. ‘సాంకేతికత సర్కస్’ లో మనిషి ఎప్పుడూ ‘రింగ్ మాస్టర్’ గానే చలామణి అవ్వాలి. ఒక్క సారి అదుపు తప్పితే ఫలితాలు ఘోరంగా ఉంటాయనేది మరచిపోకూడదు. అనవసరమైన వాటిపై కలిగే ఆకర్షణ నుండి బయట పడగలిగిన వారే తమలోని అసలైన ఆనందాన్ని కనుగొంటారు. ఇది అందరికి సాధ్యమయ్యే విషయం కాదు. స్వీయ క్రమశిక్షణ, ఆత్మ పరిశీలన, మితిమీరిన కోరికలపై కఠోర నియంత్రణ సాధించిన వారికే ఇది సాధ్యం అవుతుందని గమనించాలి.

### విముక్తి - అసలైన స్వాతంత్ర్యం

జెండా ఎగరేయడం, పరేడ్ చేయడం అనేది అసలైన స్వాతంత్ర్యం కాదు. విముక్తి అనేది బయటి గోడలు కూల్చడం కాదు, హృదయంలో, ఆలోచనల్లో, అలవాట్లలో పేరుకొని ఘనీభవించిన బానిసత్వపు గొళ్ళాలను ఛేదించి విరగగొట్టడం.

మనిషి **‘బయటి సంకెళ్లు’** తెంచుకొని గర్వపడతాడు, కానీ తన అంతరంగంలో గాఢంగా పెనవేసుకొని తిష్ట వేసిన సంకెళ్ల ప్రభావాన్ని మాత్రం అర్థం చేసుకోడు. మనిషి తనకు తెలియకుండా అనవసరమైన వాటికెన్నింటికో బానిసగా మారుతున్నాడు. ఆ క్రమంలోనే నిజమైన స్వేచ్ఛకు దూరమవుతున్నాడు.



–ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## మనుషులకి దైవభక్తి.. దేశభక్తి.. దేహభక్తి ఉండాలి

–ఆచార్య వీసీ నిత్యానందరావు

హైదరాబాద్, అక్టోబర్ 8: (నేటి నిజం ప్రతినిధి): చిమ్మపూడి శ్రీరామమూర్తి రచించిన **‘మాట కచేరి’** గ్రంథం అంకితోత్సవ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా॥కేవీ రమణాచారి దంపతులకు ఈ గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం వీసీ నిత్యానందరావు అంకితమిచ్చి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మనుషులకి దైవభక్తి.. దేశభక్తి.. దేహభక్తి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ‘స్వర రసాంజలి’ శీర్షిక తో నిర్వహించిన సంగీత విభావరి అందరినీ అలరించింది. చిమ్మపూడి ఫౌండేషన్, త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు అనంత పద్మనాభరావు, అరుణ, యదుమోహన్ తదితరులు పాల్గొన్నారు.



డా॥కే.వి.రమణాచారి దంపతులకు ‘మాట కచేరి’ గ్రంథం అంకితమిచ్చి సత్కరిస్తున్నా ఆచార్య వీసీ నిత్యానందరావు.

## అరుణతార



అమ్మను మరోసారి కోల్పోయాను
అరుణమ్మ కన్నుమూతతో..

ఇంటికొచ్చిన గోపిసార్ శిష్యులమైన మమ్మల్ని
మరెవరూ ఆదరించని రీతిన ఆతిథ్యంతో
తన పిల్లల్లా ఆదరించడం తనకే చెల్లింది.

పాఠకుల్ని ‘పాటల చెట్టు’ ఎక్కించి
‘సూదిలోకి ఎక్కిన సూత్రం’ శ్రమను స్ఫురింపజేస్తూ
‘మౌనమూ మాట్లాడుతుంది’ అంటూ స్ఫురదృష్టితో
స్ఫూర్తిదాయక కవిత్వాన్ని సమకూరుస్తూ సమర్పిస్తూ
లేటుగా రంగప్రవేశం చేసినా లేటెస్టు టేస్టుకు తగ్గట్టుగా
సూక్ష్మ, సూత్రప్రాయ పాయసాత్మకంగా అందించింది
తన అనుభవాల్ని రంగరించి చిందించింది.

అనారోగ్య ఊబిలో కొట్టుమిట్టాడుతుండగా
జీవన చదరంగం ‘తోసిరాజు’ అనడంతో తొలగింది
‘అరుణతార’గా మారింది.



– డా॥రాపోలు సుదర్శన్
సెల్: 94417 79688

## ఇప్పుడిహ కలలకు కాలం చెల్లిపోయింది

చెట్టూ చేమా మిద్దెపైనెక్కి బిక్కు బిక్కుమంటూ
ఒంగి ఓదారుస్తున్న నీలాకాశం ఒడిలో ఒదిగి
మాటరాక ఓదార్చలేక బిగిసిపోయిన గాలి మెత్తని స్పర్శకు
కరిగి కన్నీరవుతూ చూస్తుంటే
గాజు అద్దాల మధ్య ప్రపంచం మొత్తం కాచివడబోస్తూ
వెచ్చదనమూ సమశీతలమూ పెంపుడు కుక్కల్లా అదుపులో పెట్టుకు
దివా రాత్రాలకు తేడా లేనంతగా ఆధునికత పులిమాక
నిద్ర రాని కళ్ళకు నీడలు సోకని ఉనికికీ స్వప్నాల మాటెక్కడ?
అహరహమూ అప్రమత్తమై ఉండే మనసుకు కలల మాటెక్కడ?
వేలికొసలనిండా యంత్రాల సరిగమలూ
చూపు చివరంచుల వరకూ ఆకాశ హర్మ్యాల ఆశలూ
గుండె నిండా కల్మషాల మురికిక్కలవలూ
అణువు అణువునా కుప్పిగంతులు వేస్తున్న కౄరత్వం
ఎదుటి వారి నడి నెత్తిన చెయ్యుంచి పచ్చని నేలలను మేసి విశ్రమించే
పసిరిక పాముల కాలం ఇది
ఇంటింటా గొంతెత్తి తీతువులు గానం చేసే
రాజకీయాల మారణ హోమం ఇది
ఇప్పుడిహ కలలకు కాలం చెల్లింది.
కలవరించవలసినది మహాభారత సంగ్రామమే.



–స్వాతీ శ్రీపాద
8297248988



# అభినందన

బాల సాహిత్య పురస్కారం కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి పొందిన శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు సుప్రసిద్ధ కవి, రచయిత, సాహిత్యవేత్త, ఇప్పుడీ “దృశ్యభాష” వచన కవితా సంపుటితో తెలుగు సాహిత్యానికి అమూల్య సంపదను అందించటానికి ముందుకు వచ్చాడు.

అందరికీ తెలుసు భాష శ్రవ్యం. శ్రవ్యం. ఈ భాషను ఈ కవి ఇప్పుడు ‘దృశ్యం’గా, దార్శనికంగా చూపుతున్నాడు. 50 ఏళ్లుగా సాహిత్య సృష్టి చేస్తున్న శ్రీ ఉమా మహేశ్వరరావు సహృదయుడుగా, సాహితీ సదస్సుల నిర్వాహ కుడుగా, సాహితీ స్రష్టల ప్రోత్సాహకుడుగా, అభ్యు దయ భావకుడుగా, ఆత్మీయ మి త్రుడుగా, సాహిత్య స్రష్టగా తెలుగు రాష్ట్రాలకు సుపరిచితుడైన మధుర మానవుడు.

ఇది **‘దృశ్యభాష’** 50 ఏళ్లుగా ఈ కవితలు తెలుగు పత్రికల్లో ప్రచురింపబడ్డప్పుడు చదివి ఆనందించిన కవి పండిత ప్రముఖులకు శ్రీ నారంశెట్టి విశిష్టంగా పరిచితుడు.

ఈ కవి సాహిత్య సృజనం సామాజిక బాధ్యతగా భావించాడు. భిన్నాంశాలు, విభిన్న సందర్భాలలో వ్రాసి నాటి పత్రికల్లో ప్రచురించాడు. సామాజిక వ్యధ ఈ కవి జీవన వ్యధ. సమాజంలోని అసమానతలను ప్రశ్నించాడు. అనర్థాలను తిరస్కరిం చాడు. అశాంతికి ఆక్రోశించాడు. అలాగే తల్లిదండ్రుల పట్ల అమిత ప్రేమ చూపాడు. ప్రముకాంద్రుల్ని ప్రశంసించాడు. గుణ శీలోన్నతులను శ్లాఘించాడు.

సత్ సందర్భాలను ప్రేమించాడు. సహృదయుల్ని తన కవిత్వంతో ఆలింగనం చేసుకున్నాడు. కవి సున్నిత హృదయుడై, సుకుమార భావుకుడై, సామాజిక సందర్భాలకు స్పందిం చాడు. సంస్పందించాడు. తనలో తాను సంఘర్షించాడు. ఆత్మవేదనను సుందరంగా కవితా మందిరంగా అందించాడు.

శ్రీ నారంశెట్టి ఉమా మహేశ్వర రావుకు తెలుగు భాష ఇష్టం. తెలుగు ప్రజలంటే ప్రాణం. తెనుగుదనం అంటే అమిత ఆరాధన. చిన్న చిన్న మాటలతో పెద్ద పెద్ద భావాలు పలికించే సామర్థ్యం ఉంది కవికి. సమాంతర వాక్యాలతో, సముజ్జ్వల భావం పలికించే నేర్పుఉంది. అసలు సిసలు రచయిత కావడం వల్ల, బాల సాహిత్య స్రష్ట కావటం వల్ల, అలతి అలతి పదాలతో, సమాంతర వాక్య నిర్మాణ దక్షతతో అద్భుత కవిత్వ నిర్మా ణ సమర్థంగా కవిత్వం వ్రాశాడు. ఉన్నతాంశాలు ఉత్తమ భాషలో, దృశ్య సుందరంగా వ్రాసే శక్తి ఈ కవికి చాలా కాలంగా సొంతమయ్యింది. ఈ **“దృశ్య భాష”**, ఈ రెండు గుణాల సంపుటీకరణంగా ఉండటం సహృదయ పాఠకులు గుర్తిస్తారు.

తల్లి అంటే అందరికీ మాటల కందని మమకారం ఉంటుంది. తల్లి ప్రేమ, మమకారం తనివి తీరా అనుభ వించిన కవి మధుర కవిత్వం వ్రాశాడు.

**“మా ఊరి చెరువులో కలువ పువ్వుల్లా**
**మా కల్లంలో ధాన్యం గింజల్లా”**

ఉన్న పిల్లల్ని, ఆ పిల్లల తల్లుల్ని తనివి తీరా స్తుతించాడు కవి.

**“అమ్మను కొలిచేవారికి కష్టాలే దరిచేరవు**
**అమ్మను ప్రేమించు వారిని దైవాలే దీవించును”**

ఎవరికయినా కష్టాల కడళ్ళు ఎదురైతే, వాళ్ళు అమ్మను పూజించలే దని మనకు తెలిపి, లోకానికి కర్తవ్యం బోధిస్తున్నాడు కవి.

నాన్నను **“కనుపాపలా కాపా డుకో”** అని చెబుతూ

**“ఆ దేవుడిచ్చిన నజరానా**
**ప్రేమానురాగాల అభిమానాప్యాయతల ఖజానా”**

నాన్న అని వివరించి తండ్రిని వృద్ధాప్యంలో పసిబిడ్డ లాగా చూసుకొమ్మని హితబోధ చేశాడు కవి.

జలమే జనం అని గోదావరికి వందనం పెట్టి, సమాజానికి నదులు సంస్కృతిని ప్రసాదించాయని ప్రజా సమూహాలను మేల్కొలుపుతున్నాడు కవి.

గొర్రె కసాయి వాణ్ని నమ్మినట్లు, మోసగాళ్ల చుట్టూ, గానుగెద్దుల్లా, మన వాళ్లు తిరుగుతూ ఉంటారని కవి వ్యధ చెందాడు.

అబ్దుల్ కలాం అంటే కవికి అమిత ఇష్టం.

**“బ్రహ్మాండ చరితను సృష్టి చేసావు**
**బ్రహ్మచారిగానే మిగిలిపోయావు**
**ఎవరెస్టు కన్నా ఎత్తు ఎదిగావు**
**వామనుడిలాగే ఒదిగి ఉన్నావు”** ఇలా తారతమ్యాలు చూపుతూ అబ్దుల్ కలాంకి సలాం చేసిన కవి ధన్యుడు.

స్త్రీ అంటే కవికి అపార గౌరవం. అందుకే కవి అభివ్యక్తి చూడవచ్చు.

**“అతివ అంటే అందాల బొమ్మ కాదు**
**మనసు మమత తెలిసిన మగువ**
**అమ్మ అక్కల ప్రతిరూపం”**

స్త్రీ మూర్తిని తల్లిగా, అక్కగా, చెల్లిగా, మనుమరాలిగా చూచి తరించే మార్గం చూపుతున్నాడు. ఆలిగా, అమితానురాగ ప్రేమికగా ఆమె ఆత్మీయానుబంధం ప్రతి పురుషుడు, అదృష్టవంతుడైన ప్రతి పురుషుడు పొందే అదృష్టం విడమరచి చూసాడు శ్రీ నారంశెట్టి ఉమా మహేశ్వరరావు.

దృశ్యభాష కావ్యంలో అనే శీర్షికతో ఉన్న కవిత్వం ‘సినారె’ని సంస్తుతించేదిగా ఉంది. సినారె నిత్య ‘సాహిత్య హాలికుడు’, అక్షర ఋషి, కవిత్వానికి చిరునామా, పున్నమి చంద్రుడు, సూర్యనారాయణుడు, జ్ఞానపీఠుడు, పద్మభూషణుడు అని చెప్పినా తనివి తీరిక మరింతగా చెప్పాలని **“అక్షర రారాజు, మమతల మారాజు”** అని ప్రస్తుతించాడు.

ఉత్తరాంధ్రలో విప్లవం ఉవ్వెత్తున లేవటం ఆంధ్రులకు తెలుసు. పార్వతీ పురం వాసి అయిన కవి విప్లవం పేరిట రాసిన కవిత్వం చదివి ఆంధ్రులు ఆనందిస్తారు.

**‘తెలుసా?”** అన్న కవితలో స్త్రీ పట్ల సమాజం పౌరాణిక కాలం నుంచి చూపుతున్న దౌష్ట్యం ప్రదర్శించాడు కవి. చదవండి. గుండె కలుక్కుమంటుంది.

చూచే చూపును బట్టి ఆమె కళ్ళు కనిపిస్తాయి. ఒకరికి ఆ స్త్రీ కళ్ళు **“ఆకర్షణకు మారు పేర్లు”** మరొకరికి అవి ‘అమాయకతకు చిరునామాలు” ఇంకొకరి దృష్టిలో అవి **“ అందానికి ప్రతిబింబాలు”**. చూచే చూపుల్లో ఎంత తేడా! ఎన్ని తేడాలు!!

కవికి సమ సమాజం ఇష్టం. అందులో

**“వాడు పస్తులుండే అవసరం లేదు**
**వీడు మస్తుగా తినే అవకాశం రాదు”**

ఇదీ కవికి ఉన్న సామ్యవాద దృష్టి. భవిష్యత్ సమాజాన్ని కలగంటున్న కవి అభీష్టం.

శ్రీ నారంశెట్టి ఉమా మహేశ్వర రావు మంచి ఆశయాలున్న కవి.

గొప్ప ఆదర్శాలున్న సహృద యుడు. గొప్ప సమాజం నిర్మాణం కావాలని, గొప్ప మానవీ మానవులు ఆవిర్భవించే కాలం రావా లని, ఆరాటపడుతున్న కవి, ఉదాత్త భావాలను సముచిత సుందర భాషలో సంక్షిప్తం గా అభివ్యక్తం చేసే శక్తి ఉన్న కవి.

ఇంత మంచి కవిత్వం వ్రాస్తున్న కవి, భవిష్యత్తులో మరింత మంచి కవిత్వం వ్రాస్తాడని, మనల్ని మరిం తగా అలరింప చేస్తాడని ఆశిస్తున్నాను. అభినందిస్తున్నాను.



– కొలకలూరి ఇనాక్



ప్రతులకు:
ఇ.నెం.14-1-83,
జిల్లా ట్రేసరీ ఆఫీసు ఎదురుగా
గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్
బలగాం, పార్వతీపురం
మాన్యం జిల్లా- 535 501 ఆంధ్రప్రదేశ్
సెల్: 9490799203



> నారంశెట్టి ఉమామహేశ్వరరావు కవితా సంపుటి “దృశ్యభాష”కు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు రాసిన ముందు మాట

# రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన "ముదిర" వచనకవితా సంపుటి ఆవిష్కరణ

హైదరాబాద్, అక్టోబర్ 8: (నేటినిజం ప్రతినిధి):రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన "ముదిర" వచనకవితా సంపుటిని ఆమె తల్లిగారైన సత్యవతీ దేవి తలపులలో సెప్టెంబర్ 28న తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభాధ్యక్షులు, ముఖ్య అతిథులనే వారు లేకుండానే వేదికనలంకరించిన కవయిత్రులు, రచయిత్రులు, పాత్రికేయులు, చరిత్రకారిణుల నడుమ శ్రీమతి వెలివోలు నాగ రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. ఇది ఓ పండుగ వాతావరణం.ఓ గొప్ప సందర్భం.ఇది కేవలం పుస్తకావిష్కరణ సభ మాత్రమే కాదు ఆయా రంగాలలో విశిష్ట సేవలు చేస్తున్న స్త్రీ మూర్తులను బిరుదులతో ఘనంగా సత్కరించిన సభ కూడా. అందుకే ఈ సభ ఇతర సభల కన్నా ప్రత్యేకమైనది. సమావేశాన్ని ప్రారంభిస్తూ ఒక అమాయక పల్లెటూరి బాలిక ఒక మహా సాహిత్య శిఖరంగా ఎదగడంలో తమ తల్లి





రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన "ముదిర " వచనకవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

గారైన సత్యవతీ దేవి గారు ఎలా స్ఫూర్తినిచ్చారో తెలియజేశారు మల్లీశ్వరి గారు. ఆమె రాసిన నా జ్ఞాపకాలలో అమ్మ... అనే కవితను శ్రీమతి శాంతి నిర్మల చదవారు. **"ముదిర"** అంటే స్త్రీ. స్త్రీ అద్భుత మనోభావవిలాస విన్యాస ప్రదర్శనమే ముదిర. స్త్రీమూర్తి హృదయం ఎదుర్కొనే సంఘర్షణను కళ్ళకు కట్టినట్లుగా 85 కవితలను, అద్భుత పద సంపదతో భావుకతతో అద్భుత కవితాత్మకతతో రచింపబడిన ఈ ముదిరను గురించి ముందుగా ఆచార్య నాగరాజ్య లక్ష్మి వివిధ కోణాలలో స్త్రీ ఆశలు, కోరికలు, వ్యథలు, సంఘర్షణలు చక్కని పద ప్రయోగాలతో రాసిన కవయిత్రి హృదయాన్ని చక్కగా విశ్లేషించారు. అలాగే సమీక్షకురాలు, గాయని శ్రీమతి లక్ష్మి భవాని ముదిర ప్రాచీన ఆధునిక సాహిత్యాల మేలు కలయిక. స్త్రీ అంతరంగావిష్కరణ అని ఆంధ్రజ్యోతి చీఫ్ సబ్ ఎడిటర్ శ్రీమతి అనురాధ అమ్మ ఇచ్చే స్ఫూర్తిని గురించి , కవయిత్రి శ్రీమతి మూర్తి శ్రీదేవి మల్లీశ్వరి గారి వ్యక్తిత్వాన్ని, భావుకతా కవిత్వాన్ని గూర్చి , కవయిత్రి శ్రీమతి లావణ్య సైదీశ్వర్ ముదిర లోని అనేక కవితలను విశ్లేషిస్తూ సమాజంలో స్త్రీ అణచి వేయబడుతున్న విధానాన్ని గురించి మరో రచయిత్రి తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి గారు రాజావాసిరెడ్డి మల్లీ శ్వరి గారి పద ప్రయోగాల విశిష్టత ను వివరించగా రచయిత్రి డా.కోనేరు లక్ష్మీ ప్రమీల గారు మల్లీశ్వరి గారి భాష సేవను కొనియాడారు. చివరిగా కవయిత్రి మల్లీశ్వరి గారు మాట్లాడుతూ స్త్రీ శక్తివంతురాలని, అన్ని ఆటంకాలను ఎదుర్కొంటూ, స్థిర చిత్తంతో ముందుకు పోవాలని...వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యక్రమంలో రాజావాసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారు డా.కోనేరు లక్ష్మీ ప్రమీల గారికి తొలి తెలుగు చరిత్ర కారిణి బిరుదుతో పాటు జీవన సాఫల్య పురస్కాన్ని, డా.వెలువోలు నాగ రాజ్యలక్ష్మి గారికి సారస్వత ప్రపూర్ణ, డా.లక్ష్మీ భవాని గారికి లలిత కళా ప్రపూర్ణ, డా.తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి గారికి సాహితీ ప్రపూర్ణ, శ్రీమతి . అనురాధ గారికి చరిత్రాన్వేషిత రత్న, శ్రీమతి మూర్తి శ్రీదేవి గారికి సమీక్ష రచనా రత్న, శ్రీమతి లావణ్య సైదీశ్వర్ గారికి సాహితి రత్న, శ్రీమతి పెదపోలు శాంతి నిర్మల గారికి గాన కళా రత్న, బిరుదులను ప్రధానం చేస్తూ, శాలువాలతో , జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

ఈ సభా కార్యక్రమానికి సహృదయంతో విచ్చేసిన కళారత్న డా.బిక్కికృష్ణ గారు, ప్రముఖ గజల్ కవి శ్రీ సురారం శంకర్గారు, యువకవి శ్రీ కళ్ళెం నవీన్ రెడ్డి గారు ఇంకా అనేక మంది ప్రముఖులు 70 మందికి పైగా ఈ పండుగ రోజులలో కూడా హాజరై చివరి వరకు ఉండడం ఒక విశేషమైతే వక్తలు ఇంకా ఏమి చెబుతారో అంటూ చాలా ఆసక్తి గానూ, నిశ్శబ్దం గాను వినడం మరొక విశేషం.

ఈ సభ ఆద్యంతం చాలా హుందాగా, మధ్య మధ్య మధురమైన గజల్ గానాలతో చక్కని ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. ఇంత మంచి సాహిత్య కార్యక్రమంలో శాంతి నిర్మల వ్యాఖ్యా తగ వ్యవహరించారు.వినూత్న కార్యక్ర మాలు నిర్వహిస్తూ, ఎం దరో ఔత్సాహిక కవులను, కళాకారులను ప్రోత్సహిస్తు న్న రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి గారి సహృదయతకు ఎందరో ధన్యవాదాలు తెలియజేశారు.


లావణ్య సైదీశ్వర్ని సత్కరిస్తున్న దృశ్యం


డా।। తంగెళ్ళ శ్రీదేవిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం


డా।। లక్ష్మీ ప్రమీల కోనేరుని సత్కరిస్తున్న దృశ్యం


డి. పి. అనురాధని సత్కరిస్తున్న దృశ్యం


డా।। లక్ష్మీ భవానిని సత్కరిస్తున్న దృశ్యం


శాంతినిర్మలని సత్కరిస్తున్న దృశ్యం


డా।। వెలివోలు నాగరాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

## హైకూలు

- బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

మునకలేస్తూ
బుడుంగు శబ్దం చేస్తూ
నదిలో చేప.

అడవి శోభ
ప్రకృతి పరవశం
మయూరి నాట్యం.

మహా సవ్వడి
ఆకాశం వణికింది
మేఘ గర్జన.

పూలు పూస్తాయి
ఉదయాస్తమయాలు
ప్రకృతి శోభ!

అంశం: కుక్కతోక

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1576వ రోజు 'కుక్కతోక' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'కుక్కతోక' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా।।రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839



### వక్రబుద్ధి

వక్రబుద్ధి వితండవాది
ఆలోచనతో సంబంధం లేని
మూర్ఖరాజసుతుడు
తా పట్టిన కుందేటికి
మూడే కాళ్ళనే
మహా పండితాగ్రేసర చక్రవర్తి
వినడు మాట
వినిపించిన మాట
వినపడదు
చెప్పినవారు మూర్ఖులు
తానే గొప్పవాడు
మంకు పట్టు
మొండితనం
మహా మంచి గుణాలు
పద్ధతితోపాటు పాటించే
నష్టజీవికి ఉదాహరణ
కుక్క తోక వంకర
చెబితే చెవి కెక్కదు
కొడితే శరీరార్పణ
కొట్టుకోమని
బుద్ధి అంతే
బురదగుంట
మనసు మామూలే
చక్రవర్తి మహాశయుడు, కదా!.
నేర్పించలేం
మరిపించలేం
కోరి తలకు కొక్కిరాయిని
తగిలించుకోలేం
అటువంటివారిని
తూర్పు తిరిగి దండం పెట్టి
వదిలించుకోవాలి.

**-కె.కె.తాయారు**

### వైరాగ్యాల కుక్క తోక

ఎన్నిసార్లు తిన్నగా చేసినా
వంకర తిరగడమే
కుక్క తోక నైజం
ఎన్నిసార్లు బుద్ధి హెచ్చరిస్తున్నా
మనసుకే లొంగి వంకర మెలగటం
మానవ సహజం.
వేదాంతం బోధిస్తున్నా
రాద్ధాంతాల్లో నలగటం
ఉదంతాలు వినిపిస్తూన్నా
పట్టనట్టు మెలగటం
కష్టాలు విషాదాలప్పుడు
తటస్థించిన వేదాంతం
క్షణాలు దాటేవరకే
దైవ స్మరణం
మరుక్షణం
తానంత వారెవరూ లేరని ప్రగల్భం.
భయంకర బాధలవునంటే
వలదనే దానిని
ఏమైనా ఈ తప్పిదానికి
మరో మారు అవకాశం ఇవ్వనని
అనుకున్న ఆ పడతి,
బిడ్డపుట్టి అక్కున చేరాక
ప్రసూతి వైరాగ్యాల కుక్క తోక.
దగ్గరగా కలిసి గడిపిన
అతిథులను మనవారిని
ప్రయాణాల్లో సాగనంపేందుకు
రైల్వేస్టేషన్లు బస్సు స్టాండుల్లో
వియోగక్షణాలు
ఎంత భారమో
వారి ప్రస్థానం మరుక్షణం
తన ప్రపంచంలో
ముక్తివిహంగాల అనూహ్య స్పందన
ప్రయాణవైరాగ్యాల ప్రహసనాల కుక్క తోక.
మృతిచెందిన వారిని కాటికి చేర్చి
భవబంధాలను విడిచి
దహన వాయువుల్లో లీనమయ్యే దృశ్యం,
ఎందుకీ తాపత్రయం
పరస్పర వైషమ్యాలు
ఏవీ కూడా రావనే సత్యం
అన్నిటినీ త్యజించాలనే ఉద్దేశ్యం
కాళ్ళు కడుగుతూ
శ్మశానవాటిక వదిలినవెంటనే
కుక్క తోక దులిపేసి వంకరైనట్టు
శ్మశానవైరాగ్యాల కుక్క తోక నైజం.
మనమంతా
ఆ నైజాన్ని సహజంగానే ఆచరిస్తాం
చెప్పేవి నీతిమాటలు
చేసేవి అక్రమ చేతలు.
సర్వం మాయల విషమ వలయం.
కుక్క తోకల మానవ నైజం.

**-రాజప్ప**

### వంకర బుద్ధి!

పిదప కాలం పితక బుద్ధులు
ఎవరు చెప్పినా వినరు
తెలిసీ తెలియని మూర్ఖత్వంతో
హితోక్తులు చెవిన పెట్టరు
అజ్ఞానంతో
ఆలోచించరు
మనసు చెప్పిన మాట వినరు
సుద్దులు నేర్వని వంకర బుద్ధులు
నేను నేనేనంటూ
నా దారి రహదారంటూ ..
మారని మనుషులు
ప్రతి విషయం రాద్ధాంతం చేస్తూ
ఉన్మాదం తలకెక్కిన నైజం
ఉగ్రవాదమే ధర్మమని
వేగిపోతూ
తాము చస్తూ..చంపటమే
మానవ ధర్మం గా భావిస్తూ
వంకర బుద్ధులతో
తీరని కోర్కెలతో
వక్రించిన నైజం..
సరికాదు కుక్కతో పోల్చడం
విశ్వాసం దాని ప్రాణం
నేస్తం కడవరకూ
నీ జన్మ కడతేరేవరకూ
నీ వెంటే తోడు నీడగా..

**-పి.పద్మావతి**

### సహజ గుణం

ఏండ్లకు ఏండ్లు కృషి చేసినా
అది వంకరే
ఎలుక తోలు తెచ్చి
ఎంత ఉతికినా నలుపే
కుక్క తోకకు
ఎంత బరువు వేసినా
యధాతథమే
కర్రలు ఎన్నిరోజులు
బిగించి వీడినా వంకరే
సహజ గుణం మారనట్లే
కుక్క తోక వంకరే
కనకపు సింహాసనంపై
కూర్చోబెడ్తే ఫలమేంటి?
పంచభక్ష్యపరమాన్నం
పెట్టినా ఫలమేంటి?
లోభి దగ్గర
ఎంత సిరిసంపదలున్ననేం.
పందికి
పన్నీటి స్నానమె?నరిస్తే
ఫలమేంటి?
మూర్ఖుడికి సుభాషితాలు
ఎన్ని చెప్పినా ఫలమేంటి?
చెడిపోయేవాడికి
చెప్పుడు మాటలు సున్నతం
అప్పుల గొప్పల ఊసెపుడూ
ఆత్మహత్యా సదృశ్యం
ఎత్తుల జిత్తుల నక్కకు
ఆలోచన ఎప్పుడూ వంకరే
తల్లి చేలో మేస్తే
దూడ గట్టున మేస్తుందా
పులి పులే
సింహం సింహమే
మృగరాజు ఠీవి కంఠీరవమేగా
నక్క వాతలెన్ని పెట్టుకున్నా
పులి కాదుగా
సహజ లక్షణాలే
సహజాతమై నిలుస్తాయి!.

**-లక్ష్మారెడ్డి పసుల**

### సరిచేయలేని వంకర

ఒకసారి జరిగిన పొరపాటు
తిరిగి జరిగితే అదే గ్రహపాటు
మళ్ళీ మళ్ళీ అదే చేస్తే
కుక్కతోక వంకర చందం.
అంటారు చూపరులు
వంకరబుద్ధి సరి చేయలేరని
కుక్కతోకకు రాయి కట్టి
రాయి ముడివిప్పితే వంకరేగా.
కొందరిది
ఆలయమందొకతీరు
ఆడవారితో ఒకతీరు
దొంగకా చేతి దురద తీరునా
దొంగిలించక ఎలాగైనా.
తప్పులు మానవసహజం
దిద్దుకొనే యత్నం మానవత
దాచుకొనే యత్నం దానవత
అదే తప్పుచేస్తే కుక్కతోకే!.

**-ప్రశాంతి రేవూరి**

### ఎప్పుడూ వంకరే!

పోలిక వక్రబుద్ధులకు
కుక్క తోకతో!
మానరు అవగుణం
నీతులెంత చెప్పినా!
వంకర తోక
కుక్కకొక శారీరక లోపం!
అయితే మణిపూస
మానసికంగా!
ఏ జంతువుకూ లేదు
దాని విశ్వాసం
పెంచిన యజమాని
ఇంటికి కాపలాగా
బెదిరిస్తుంది దొంగలను
చొరబడకుండా
ప్రాణాలకు తెగించి రక్షణ.
తీసికట్టు మనిషి గుణం
కుక్క విశ్వాసంతో
ద్రోహం చేస్తాడు మనిషి
బాగా నమ్మినోడికి!
వెన్నుపోటు వెనక నుండి
మానవత్వమే మరచి
తోటి మనుషుల హత్య
చిన్న పెద్ద అనక మానభంగాలు
తప్పుడు పత్రాలతో
బ్యాంకుల దోపిడీ
మంచి బుద్ధులెన్ని చెప్పినా
మారడు ఈ మనిషి!
మర్నాడే చెడు పనులు
అందుకే
తోక ఎంత వంకరగా ఉన్నా
విశ్వాసం చూపేది
శునకం ఒక్కటే !!.

**-కోలా సత్యనారాయణ**

### చక్కని నేస్తం

తోకవూపుతూ దరిచేరే
శునకం నరునికి నేస్తం
పెంచుకుంటే
మమతను పంచి
ప్రాణం పోయేవరకు
నమ్మకానికి కాపలా కాస్తూ
మోసం ద్వేషం లేక
నివసించే జీవి
కొద్దిగా మెతుకులు వేస్తే
ప్రేమపంచే ప్రాణి
నమ్మకానికి భరోసా
శ్వానానికి విశ్వాసం శ్వాస!!.
కుక్క తోక వంకర కానీ
ఆనందపు వేళా
ఊపుతుంది అందంగా
ప్రేమైక జీవి
విశ్వాసానికి ఠీవి.
కుక్కతోక పట్టుకుని
గోదారి ఈదినట్టు
సంసార సముద్రాన్ని
ఈదడం అసాధ్యం.
కుక్కతోక వంకరే
సింహాసనం ఎక్కించినా
కొందరి వక్రబుద్ధి అంతే మరి
మారని మనిషి
తీరని కోరిక
ఏరిపారేసే నైజం!!
వంకర బుద్ధి వారితో జాగ్రత్త.

**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**

### చెడిన చెడు నడకంతా....

ప్రేమతో చిన్న పిలుపు చాలు
యజమాని స్వరానికి ఉప్పొంగే ఉల్లం
కుక్క కదా మోసం ద్వేషం తెలియదు
ధర్మరాజుతో సశరీరంగా స్వర్గయానం.
కుక్కతోక వంకరే
గొర్రె తోక ఎన్నాళ్ళు పెరిగినా బెత్తెడే
ఏవీ తమకు తామే
స్వీయ నిర్మాణాలు కావు.
పరనిందకు మనిషి అవగుణాలకు
కుత్సిత కుట్ర బుద్ధులకు తెగిపడిన మాట
కుక్కతోక వంకర
మారని మనుషులకిది
తగిలించిన బిరుదు.
పండిత పామరుల నోట పలికిన సామెత
జనపదాలలో దృష్టి సారించిన పాత కథ.
మనిషైనవాడంటేనే
నిజమైన సుగుణాల రాశి
ఏ మాయలో పడి నడిచాడో
అడ్డదారుల్లో
అసలు మనిషి మరణించాకే
వక్రబుద్ధి పాలు.
చెడిన చెడు నడకంతా
విశ్వశాంతికి విఘాతం
తన్ను తాను తిరిగి చూసుకుంటే
అఘాతంలో పడి వికృత రూపం.

**-ఏదెల్లి రాములు**

### ఐతే!?

ప్రపంచం సవాలక్ష సమస్యలతో
తలబద్దలై
సొంతి అమృతాంజనం
పట్టిస్తున్న రోజుల్లో
కుక్కతోకతో పనేంటిట!?.
కుక్క తోక వంకరటింకర
ఐనా నష్టమా?!
దేశానికి అరిష్టమా??
కోడిగుడ్డుకి ఈకలుపీకే
నోటికి దూలగొండి
దురద ఉన్నవారే
మనసు బుద్ధి వంకర్లు
అవాకు చెవాకుల
కప్పగంతులు
కుప్పిగంతులతో
మూతి ముదువంకర్లు.
కుక్క తోక కి రాయికడితే
సూటిగా వేలాడుతుంది
భయంవేస్తే తోకముడిచి పలాయనం
శునకం తోక తో పనేమి?
మనిషి బుద్ధి వాచాలతకన్న
మిన్న అని గ్రహిస్తే మేలు.
దెప్పుడు వ్యంగ్యం తో
కయ్ కయ్ అనే జనాలను చూసి
భయంతో పారిపోతుంది
లేదా
తోక ఝాడించి
భౌ భౌ మొరుగుతుంది.
అనవసర విషయాలపై
రాద్ధాంత సిద్ధాంతాలు కాలయాపన
మానవుల నైజం
ఏంచేయాలో తోచక
కుక్క తోక పట్టుకుని
గోదావరి ఈదే ప్రయత్నం
ఇవే కదా నేటి సిగపట్లగోత్రాలు.

**-ఎ.రాజ్యశ్రీ**

### సామెతల సగభాగం

విశ్వాసానికి వీర కంకణం
బుక్కెడు బువ్వ పెడితే
విసనకర్రలా వీస్తుంది
వీపంతా మనకేసి రుద్దుతుంది.
కొంతమంది రాజకీయ నాయకుల్లా
మరికొంత మంది అధికార గణాల్లా
కుక్క తోక వంకర.
ఎంత చెప్పినా వినని
మూర్ఖ శిఖామణుల గురించి
కుక్కతోక పట్టుకుని
గోదారీదినట్టు ....
మంచి మంచివన్నీ
మా అక్క శిఖలోకి
బాగలేనివన్నీ బత్తి కొమ్ముకు
వేయమన్నట్టు
సామెతలకు సగభాగమైనది.
మంత్రించి వాడుకుంటే
ఊట చెలిమల జాడలే
మంచి అడుగుజాడలే
కాదని ఛీదరించుకుంటే
బొద్దింకల వ్యవహారమే!.

**-నగునూరి రాజన్న**

### పాదుబుద్ధి

బుద్ధిలేని వాడి బుద్ధి
బాగుజెయ్యాలనుకొన్నా
కుక్కతోక వంకరతియ్యడమే
తెలుసుకో.
రింగులాగ వంగిపోయి
ఇటు అటూ ఊగుతుంది
వంకర బుద్ధులు కూడా
కుక్కతోకకు అనుసరణే!.
కుక్కకన్నీ మంచిగుణాలే
వంకర ఒక తోకలోనే
మనిషికైనా
మంచిగుణాలెన్నివున్నా
కుళ్ళు కుత్సితం లాంటి
వంకర బుద్ధి పోగొట్టడం
ఎవరికైనా కష్టం
అదివారికే నష్టం.
కుక్కకున్న లోపం
జాతికే పరిమితం
మనిషికున్న లోకం
మనసుకు సంబంధమై
అందరి మనసులను
చేస్తుంది అస్తవ్యస్తం.
రాజులైనా కొందరు
బూజుపట్టిన భావాలతో
ఆజ్యం పోస్తుంటారు.
ప్రజలు బుద్ధి చెప్పినా
ప్రగల్భాలు పలకడం
తన తప్పేం లేదంటూ
తప్పించుకు తిరగడం
ఇవన్నీ కుక్క తోక
వంకర బుద్ధులే.
కుక్కతోక పుట్టకతో
వంకర పోయినా
కుక్కగుణాలు బంగారం
తోక వంకర అయితేనేం!.
నక్క జిత్తుల మనిషి చిత్తం
అమ్మ కడుపులోనే
వంకర తిరుగుతుంది.
పుట్టుకతో వచ్చే బుద్ధులు
పుడకలతో గాని పోవు.
మనసు వంకర మనుషులతో
మన మనుగడే కష్టం!.

**-డా.సి.వసుంధర**

## ఆకట్టుకున్న గాన విభావరి



సన్మాన గ్రహీతలతో వంశీ రామరాజు, తెన్నేటి సుధాదేవి

హైదరాబాద్, అక్టోబర్ 8: (నేటినిజం ప్రతినిధి): ప్రముఖ గాయనీ గాయకులు ఆలపించిన సినీ సంగీత విభావరి శ్రోతలను ఆకట్టుకుంది. శుక్రవారం త్యాగరాయ గానసభలో స్వరరాగ ప్రవంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గాయకులు బాలకామేశ్వరరావు, సురేఖ, శ్రీదేవితో పాటు పలువురు గాయనీ గాయకులు విభావరిలో పాల్గొని శ్రావ్యగానంతో శ్రోతలను రంజింపచేశారు. అరంతరం వారిని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు సత్కరించారు.

## పేదవారికి సాయం

(కథ)



నరహరిపురం గ్రామంలో కొండయ్య అనే వ్యక్తి గుర్రపు బండి తోలుకొని జీవనం సాగించేవాడు. అతడు ఒకసారి చేమంతి పురానికి బండి కట్టాడు. ఆ బండిలో శరభయ్య, రామయ్య అను ఇద్దరు వ్యక్తులు ఎక్కారు. శరభయ్య మాసిపోయిన పాత దుస్తులతో ఉన్నాడు. రామయ్య ఖరీదైన నూతన వస్త్రాలతో ఉన్నాడు.

బండి కొద్ది దూరం పోగానే అనుకోకుండా ఒక పెద్ద రాయి తగిలి అది బోర్లా పడింది. అదృష్టవశాత్తు ఆ బండిలో ఉన్నవారికి చిన్న చిన్న దెబ్బలు తగిలాయి తప్ప పెద్దగా గాయాలు కాలేదు.వెంటనే అక్కడికి పొలాల్లో పని చేసుకుంటున్న రైతులు వచ్చి వారి ముగ్గురిని లేవదీశారు. ఆ బండిని , గుర్రాన్ని కూడా లేపి నిలబెట్టారు.

అది దానపురం అనే గ్రామం.ఆ గ్రామం జమిందారు భూషయ్య చాలా దయగలవాడు. అందరికీ ఆర్థిక సాయం చేసేవాడు. ఆయనకు ఈ విషయం తెలిసి వెంటనే అక్కడికి వచ్చి వారిని చూసి బండిని నడిపిన కొండయ్యకు, ఖరీదైన దుస్తులు వేసుకున్న రామయ్యకు వైద్యం కొరకు ఆర్థిక సాయం చేశాడు.కానీ పేదవాడైన శరభయ్యకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.ఇది చూసి అక్కడ ప్రజలకు చాలా ఆశ్చర్యం కలిగింది.

అందులో ఒకరు" అయ్యా!మీ ధోరణి మాకు ఏమీ అర్థం కాలేదు. ఇలా చేశారేమిటి?" అని ప్రశ్నించాడు. ఈ మాట జమిందారు చెవిన పడింది.ఆయన అతనితో "నేను అలా ఏం చేశాను!" అని అడిగాడు. అప్పుడు మరొకరు "అయ్యా ! పేదవాడైన శరభయ్య కు మీరు సాయం చేయకుండా ఈ ఖరీదైన దుస్తులు వేసుకున్న రామయ్యకు ఆర్థిక సాయం చేశారు. ఆ శరభయ్య ఏం పాపం చేశాడు. అతని దుస్తులు అతడు పేదవాడని చెప్పకనే చెబుతున్నాయి. ఆ పేదవానికి ఎందుకు సాయం చేయలేదో మాకు మాత్రం అర్థం కావడం లేదు "అని అన్నాడు.

వారి మాటలను విన్న జమిందారు చిరునవ్వు నవ్వి "ఈ శరభయ్య చాలా నిరాడంబరంగా ఉంటాడు. అందుకే సాధారణ దుస్తులు ధరించాడు. కానీ వాస్తవంగా ఇతడు పేదవాడు కాదు. ధనవంతుడు. ఇతడే అందరికీ ఆర్థికంగా సాయపడతాడు.అందువల్లే నేను ఇతనికి ఆర్థికంగా సాయ పడలేదు. ఇక ఈ రామయ్య చాలా పేదవాడు. ఇతడు మా అబ్బాయికి తెలుసు. నిన్ననే ఇతను మా అబ్బాయి వద్దకు ఒక పెండ్లి వేడుకలో పాల్గొనడానికి కొత్త దుస్తులు కొంటాననీ, అందులకై ఆర్థిక సాయం చేయమని వచ్చాడు. వెంటనే మా అబ్బాయి ఇతనికి పేదవాడని ఆర్థిక సాయం చేశాడు. అందువల్ల అతడు పేదవాడని నేను గ్రహించి అతనికి, బండి తోలుకునే పేదవాడైన కొండయ్యకు సాయం చేశాను. ఇందులో నా పొరపాటు లేదు. అర్హత గలవారికే నేను సాయం చేశాను"అని అన్నాడు . అది విన్న ప్రజలు జమీం దారు వివరణకు సంతృప్తి చెంది తొందరపడి ఆయనను తప్పుగా అర్థం చేసుకున్నందుకు చింతించారు.



**-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
9908554535

# అవినీతి ఎక్కడ మొదలవుతుంది?



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్,
తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

అవినీతి మూలాలలను మతాలు పట్టించు కున్నాయా? తత్వవేత్తలు, సామాజిక శాస్త్ర వేత్త లు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, మనస్తత్వ శాస్త్ర వేత్తలు పట్టించుకున్నారా అని అపుడపుడు సందేహం రాక మానదు. ఎదుటి వారి గురించి ఎంతైనా మాట్లాడుతారు. తన అవినీతి గురించి అద్దం ముందు నిలబడి తనను తాను చెక్ చేసు కోరు. సాహితీ వేత్తలు, కళాకారులు, అధికారంలో వుండేవారు ఈ అవినీతి ని యధా తధంగా ఆమోదిస్తూ పోవడం ఆశ్చర్యం కలిగి స్తుంది. పైగా అది అవినీతి, దోపిడి, అణిచివేత ఎలా అవుతుంది అని అమాయకంగా ప్రశ్నిస్తారు. వారికి అంత తొందరగా అర్థం కాదు.

## ప్రతిఫలం ఇస్తే సరిపోతుందా?

కలెక్టరుకు, వర్ణ ఆధిక్య వాదులకు, భూస్వా ములకు, పారిశ్రామిక వేత్తలకు, మంత్రులకు మాకిచ్చినంత కూలి ఇస్తాము. మా బట్టలు ఉతకండి. మా ఇల్లు ఊడ్వండి, మాకు వంట చేసి పెట్టండి. మా వాష్ రూములు, డ్రయినేజీలు బాగు చేయండి అంటే చేస్తారా?, మేం కూలి చెల్లిస్తున్నాము, ప్రతిఫలం ఇస్తున్నాము అపారంగా ప్రేమిస్తున్నాము గౌరవిస్తున్నాము అం టారు. అనుకుంటారు. ఇవి చేస్తేనే సమానంగా గౌరవిం చినట్టు. సమాన ప్రతిఫలం ఇచ్చినట్టు!

## కోసుకొని తినడానికి ప్రేమించడం నిజమైన ప్రేమా?

తన అవసరాల కోసం ప్రేమించడం నిజ మైన ప్రేమ అవుతుందా? మనిషి పశు వులను, మేకలు గొర్రెలు కోళ్లు పందులు గుర్రాలు ఏనుగులు కుక్కలను ప్రేమిస్తుంటారు. పశువులతో పని తీసుకోవడానికే గద ప్రేమించడం? మేకలను గొర్రెలను కోళ్ల ను కోసుకొనితినడానికే గద ప్రేమించేది! రైతులు పొలాన్ని, పంటలను ప్రేమిస్తారు. పంట కోసుకొని తినడానికే గద ప్రేమిస్తున్నది. కొందరు ప్రకృతిని ప్రేమిస్తున్నాన ంటారు. వారు ప్రేమిస్తున్నది ప్రకృతి అందాల ద్వారా కలిగే ఆనందం కోసం ప్రేమిస్తుంటారు. ఇలా ప్రేమ అని చెప్తున్నది తనను తాను తన కొరకుతాను, తన అవసరాలననుసరించి ప్రేమిం చడమే తప్ప ఇందులో నిజమైన ప్రేమ ఉందా? పరోపకారం చేయడంలో నిజమైన ప్రేమ ఉంది. కాని చాలా మంది పరోపకారం ద్వారా సేవ ద్వారా ఆధిపత్యాన్ని, అధికారాన్ని కోరు కుంటా రు. అలాంటి పరోపకారం, సేవ నిజమైన ప్రేమ, నిజమైన పరోపకారం కాదు. ఏదో తన కొరకు ఆశించి చేసేది నిజమైన ప్రేమ నిజమైన పరోపకారం కాదు.

## మనిషి స్వతహాగా స్వార్ధ పరుడేనా?

మనిషి స్వతహాగా స్వార్ధ పరుడా?. మనిషి పుట్టుకతోనే అనేక బంధనాలు చుట్టు ముడుతుం టాయి. అమ్మ భాష, అమ్మా నాన్నల కులం, సమాజంలో వారి స్థానం, మేనమామలు, చిన్న మ్మలు పెద్దమ్మలు నానమ్మలు తాతలు మొదలైన వన్నీ చుట్టూ ఏర్పడి వుంటాయి. ఇరుగు పొరుగు ప్రాంతం భాష పరిధిలో మనిషి సంఘ జీవిగా జీవిస్తుంటాడు.

సంఘ జీవితంలో ప్రతిదీ నిబంధిత అభ్యాసమే. ఏదీ ఊరికే రాదు. చూసి నేర్చుకుంటారు. నేర్పుతుంటారు.. అమ్మభాష నేర్పబడుతుంది. వావి వరుసలు నేర్పబడుతాయి. కులం కుల సంస్కృతి నేర్ప బడుతుంది. నేను ఆడపిల్లను అని నేర్ప బడుతుంది. అలాగే దేవుళ్ల మతాలు, సంస్కృతి సంస్కారం నేర్పబడుతాయి. బడిలో కాలేజీలో, ఆట పాటల్లో సాహిత్యం కళలతో నేర్చుకుంటారు. నేర్పబడుతాయి. ఇలా నిబంధిత (కండిషనింగ్ లర్నింగ్) అభ్యాసం ద్వారా అలవాటుగా సంస్కృతిగా వ్యక్తిత్వంగా మారుతుంటాయి.

## ఇండియాలో అవినీతి మూలాలు

భారత దేశంలో అన్ని రంగాల్లో విపరీతమైన అవినీతి ఉందని కొందరు పరిశీలకులు పేర్కొం టున్నారు. ఈ అవినీతి తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుంది. భారత దేశంలో ఇంతగా అవినీతి ఉండడానికి కారణం దేవుడికి లంచాలిచ్చి పూజలు చేసి కోరుకునే మత విధానంలోనే అవినీతి ఉందని ఒక పరిశోధన తెలిపింది. మరి కోరికలు తీర్చక పోతే, ఆపదలో ఆదుకోక పోతే దేవుళ్లెందుకు అని వెంటనే అడుగుతారు. అనగా వారు దేవుళ్లను తమ కోసం, తమ అవసరాలకోసం, తమ మనస్సు ప్రశాంతత కోసం ప్రార్థిస్తున్నామని వారికి తెలుసు. దీన్ని కొందరు అవినీతి అంటున్నారు. దేవునితో బేరం చేయడం అంటున్నారు. కొబ్బరి కాయ నీకు కోరినయన్నినాకు అనేది ఒక బేరం, ఒక అవినీతి అని అవినీతి మతం నుండి, కోరికల నుండి మొదలవుతున్నదని వారంటారు. మతం వదిలేయడం, దేవుల్ల ను కోరికలు కోరకుండా వుండడం అంత సులభం కాదు.

## సంస్కృతి సభ్యత పౌర సమాజం

కనుక సంస్కృతిని సంస్కరించుకోవడం ద్వారా ప్రారంభించాలి. భారత దేశంలో అవినీతి తగ్గించా లంటే అది ఇంటి నుండి, కుటుంబం నుండి ప్రారం భమవుతున్న అవినీతిని నిర్మూలించాలి. ఈ విష యాలు చెప్తే చాలా మందికి అర్థం కావు. అవినీతి జీవిత విధానంగా మార్చుకున్న వారికి అది "మామూలు" విషయంగా కనపడుతుంది. ఉదాహరణకు....

ఆడవాళ్లు వంట చేస్తే మగవాల్లు ఆరగించడంతో అవినీతి ఆరంభమవుతున్నది. ఇంటి పని, వంట పని, పిల్లల పెంపకం, బట్టలుతకడం మొదలైన పనులు మహిళలు మాత్రమే చేయాలనే దృష్టిలోనే అవినీతి ఆరంభమవుతున్నది. కనక కుటుంబ వ్యవస్థ నిలబడాలన్నా, స్త్రీలు పొలంలో పరిశ్రమల్లో, ఆఫీసుల్లో, భవన నిర్మాణంలో, పని స్థలాల్లో ఉపాధి ఉద్యోగాల్లో సమానంగా పని చేయాలన్నా ఇంటి పనిలో వంట పనిలో, ఇల్లు ఊడ్వడం తుడవడం అలుకు చల్లడం, వంట, వడ్డన, అతిథి సత్కారాలు మొదలైనవన్ని మగవాలు కూడ చేయడం అవసరం. స్త్రీలకు కాస్త వెసులుబాటు, స్వేచ్ఛ లభించాలన్నా, మనుషుల్లో అవినీతి వ్యకిత్వం, అవినీతి మనస్తత్వం తగ్గాలన్నా అది మగవారి చేతిలోనే వుంది. వంట, పిల్లల పెంపకం, ఇల్లు ఊడ్వడం, బట్టలుతకడం మగవాళ్లు తమ కర్తవ్యంగా మనస్తత్వం వ్యక్తిత్వం మారినపుడు అవినీతి తగ్గుతుంది. కుటుంబ వ్యవస్థ నిలుస్తుంది.

## కుటుంబ వ్యవస్థకు మూలం వంట గదియా?

ఇంటిలో వంట మాయమైతే కుటుంబ వ్యవస్థ మాయమవుతుందట! అమెరికా యూరపు ఆస్ట్రేలియా దేశాల అధ్యయనాలు చెపుతున్నాయట! కనక హోటల్లు మూసేస్తే, లేదా హోటళ్లను నిషేధిస్తే కుటుంబ వ్యవస్థ నిలదొక్కుంటుందట! కనక దయచేసి మహానుభావులారా! మగవాళ్లు ఇంటి వంట గదిలో వంట చేస్తూ పిల్లల పెంపకం చేస్తూ స్త్రీలను వంట గది నుండి విముక్తం చేస్తేనే నేడు కుటుంబ వ్యవస్థ బలపడి కొనసాగుతుంది. గమవ నించండి. కుటుంబ వ్యవస్థ కొనసాగాలంటే మగ వాళ్లే వంటగదిలో వంట చేయాలి. పిల్లల పెంపకం చూసుకోవాలి. అందువల్ల కుటుంబ వ్యవస్థ కొనసాగాలో లేదో అనేది మగవాళ్ల చేతల్లోనే ఉంది.

## బహుజనులు సాంస్కృతిక వికాసంలో ముందుండాలి.

బహుజనులు మతాన్ని విమర్శిస్తుంటారు. మతం సంస్కృతి రూపంలో, మనస్తత్వంలో వ్యక్తి త్వం రూపంలో కొనసాగుతుంది. కనక సంస్కృతిని, మనస్తత్వాన్ని, మనస్తత్వాన్ని వ్యక్తిత్వాన్ని మార్చే కృషి చేయాలి. ఆచరణలో గల పురుషాధిపత్య బ్రాహ్మ ణీయ స్వభావాలను తొలగించుకుంటూ రావాలి. అది సాంస్కృతిక వికాసం ద్వారా జరుగుతుంది. నిన్ను మార్చుకోకుండా ఇతరులను మార్చాలను కోవడం ఒక నీతి బాహ్య అవినీతి చర్య. పితృస్వామిక పురుషాధిపత్య సంస్కృతి స్త్రీ పురుషుల మధ్య ఆమోదించిన పని విభజనను ఆమోదించి ఆచరిం చినంత కాలం మతం, సగం జనాభా ఐన మహి ళల, బాలల అణిచివేత కొనసాగుతూ వుంటుంది. కనక మహిళలను వంట నుండి, ఇంటి పని, పిల్లల పెంపకంమ, బట్టలుతకడం, ఇల్లు ఊడ్వడం నుండి విముక్తం చేయాలి.

## వంటరాని వారు జంతువలతో సమానమా?

జంతువులకు పశువులకు వంట చేయడం రాదు. వంట చేయడం రాని వాల్లు, వంట చేయని వాల్లు జంతువులతో పశువులతో సమానం. ఈ విషయంలో వాళ్లు జంతు దశలో పెంపుడు జంతువుల దశలో జీవిస్తున్నారు. ఇల్లు ఊడ్వని వారు, పిల్లల పెంపకం చూడని వాల్లు బట్టలుతకని, వంట చేయని వాల్లు ఆధునిక పౌర సమాజంలో సంస్కృతి నాగరికత ల్లో జంతువు దశలో, ఆహార సేకరణ దశలో జీవిస్తున్నారు. అందువల్ల వారిలో జంతు సహతాలు, క్రూరత్వం, అణిచివేత, బలహీ నులను చీల్చుకొని తినడం తన మాట వినని వారిని కాల్చుకొని తినడం వంటి ఆధిపత్య స్వభావాలు నిబంధిత అభ్యసనం ద్వారా సహజాతంగా మార్చుకొని కొనసాగుతుంటారు. సాధువులు, సన్యాసులు, గురువులు, రాజులు, మొదలైన వంట చేయని వాల్లలో జంతు స్వభావాలు ప్రకోపిస్తుం టాయి. శాపాలు పెడుతుంటారు. శిక్షలు విధిస్తుం టారు. అణిచి వేస్తుంటారు. వంట నేర్చిన వారికి, నిత్యం వంట చేస్తున్న వారికి పౌర సమాజంలో, నాగరికతలో వుండే సభ్యత సంస్కారం అలవ డుతుంది. కూర్చున్న కాడికి టీ కాఫీ టిఫిన్ భోజనం వస్తే ఆరగించేవారు నీతి బాహ్య అవినతి పరులు. వీటన్నిటిని మార్చుకన్న పుడు సంస్కృతి మారుతుంది. మనస్తత్వం మారు తుంది. వ్యక్తిత్వం మారుతుంది. పౌర సమాజంగా ఎదుగుతారు. ఇలా అవనీతి మూలం వంట వద్ద, పితృస్వామిక పని విభజన వద్ద ప్రారంభమవు తున్నది. ఇలా వంట చేయని వారు, ఇతరులు వండి పెడితే ఆరగించేవారు పరాన్న భుక్కులు, అవినీతి, అవినీతి మూల పురుషులు జంతు సమానం అని తేలుతున్నది.

## బతుకు పుస్తకం

గాయ పడ్డావో
జ్ఞాపకాలతో
బంధింప పడ్డావో
అవమానాల
వలలో చిక్కుకొన్నావో
తెలియని అయోమయ
స్థితిలో మునక లేస్తున్నావా?
నిన్ను నువ్వు చూడాలా
నువ్వు ఎక్కడ ఓడిపోయావో
ఆ చోటు నుంచి నిన్ను నువ్వు
చూడడం మొదలు పెట్టు.
నువ్వు ఎంటో అర్థం అవుతుంది
నీ గమ్యం ఎంటో తెలుస్తుంది
తల దించిన చోటే
తల ఎత్తేక్షణం నీ ముందు
ఆవిష్కరింప బడుతుంది
ఆ క్షణాన్ని ఆయుధంగా మార్చుకొంటే
నీ జీవితం మరో జీవితానికి
ఆదర్శం అవుతుంది.
నీ బతుకు పుస్తకంలో
చిరిగి పోయిన పేజీలు
ఎండి పోయిన అక్షరాలు
కొత్తగా మళ్లీ చిగురిస్తాయి
కొత్త ఆశయాలతో
ప్రపంచానికి గెలుపు
సువాసనలు వెదజల్లుతాయి
కొత్త చరిత్రకు నాంది ప్రస్థానం
నీ బతుకు పుస్తకం అవుతుంది !!



-లక్ష్మీ శ్రీనివాస్
9676601192




## అమ్మపాట పాడాలని ఉన్నది



కన్నతల్లిని
కొనియాడాలని ఉన్నది
అమ్మభక్తిని
చూపించాలని ఉన్నది.
విశ్వమంత వినేలా
వినువీధికి ఎగిరి
మాతృమూర్తి ప్రేమను
మాటల్లో చెప్పాలని ఉన్నది.
మేఘాలపై కూర్చొని
అమ్మపాటను పాడాలని ఉన్నది
గాలిలో పక్షిలా ఎగిరి
మాతఘనతను
తెలపాలని ఉన్నది.
కన్నతల్లి కాళ్ళుకడిగి
తలపై చల్లుకోవాలని ఉన్నది
భుజాలపైన ఎత్తుకొని
భక్తితో మోయాలని ఉన్నది.
జగాన్ని మరచి
తల్లికి సేవలుచేయాలని ఉన్నది
జనయిత్రిని పూజించి
జన్మను
ధన్యంచేసుకోవాలను ఉన్నది.
అమ్మ మనసునెరిగి
మసుకోవాలని ఉన్నది
అమ్మ కొరికలను
తీర్చాలని ఉన్నది.
తల్లే దేవతని
చెప్పాలని ఉన్నది
తల్లే గొప్పయని
చాటాలని ఉన్నది.



-గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## మాతృ హృదయం

బ్రతుకు "బంగారు బాట" కావాలని
ఆశపడుతోంది ఆమె!.
కష్టాలను దిగమ్రింగి,
కన్నీటిని కళ్ళలో దాచి ;
సంసారాన్ని
"భవిష్యత్తు వేట" కై భారంగా సాగిస్తోంది.
"చదువే పెన్నిధని"
తనలా కాకూడదని
పాపకై తపిస్తుందా హృదయం!
"అక్షరాల పుప్పొడి"తో
జ్ఞానసంపదను నేర్వబోయే
తన బిడ్డకై ఎదురుచూస్తోందా మాతృ హృదయం!

-బెహరా నాగభూషణరావు
+91 94400 59186

## దసరా సంబరాలు

ఓ జగదాంబా
నీవే మాకు శరణం
అంబవై, జగదాంబవై
సకల జగతిని చల్లగ బ్రోచే అఖిలాండేశ్వరివై
అసురుల గర్వం అణచే
ఓ ఆది పరాశక్తివై
మము కాపాడుమా
ప్రతినిత్యం
నీ పరాక్రమాతి శయానికి,నీ వీరోచితమైన
సాహసానికి
నిదర్శనం ఈ దసరా పర్వదినం
రమణీయం, కమనీయం,
భక్త జన కోటి నిను
ఆరాధించే వైనం
సకల జీవ కోటికే
ఆనందమే ఆనందం
నీవు గాక మాకెవరు
మాకిల చల్లగా చూసే దైవం
మహిషాసుర మర్దనివై
ఈ మహినే గాచిన కారుణ్య మూర్తివే
మానవుణ్ణి దానవునిగా
చేసే అహంకారాన్ని,
అసూయ, ద్వేషాలను
సమూలంగా దూరం చేయుమా
మము కారుణ్య
మూర్తులుగా చేసే
వరమీయుమా
నీ కారుణ్యమే
కదా అఖిల జగతికి
సర్వదా శ్రేయోదాయకం.

-గాదేపల్లి మల్లికార్జునుడు
హైదరాబాద్.

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319
"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

## దసరా

ఆశ్వయుజ మాసాన తొలి పండుగ
శరదృతువు లో శరన్నవరాత్రుల సంబరం
నవరాత్రులు నవ విధ అలంకరణలు
భక్తి శ్రద్ధలతో ముగ్గురమ్మల మూలపటమ్మను
కొలిచే పండుగ
తంగేడు, గుమ్మడి, గునుగు పూలు, బంతులు,
చామంతులతో అనేక పరిమళభరిత విరుల
సమాహారాల తో కూడిన బతుకునిచ్చుబతుకమ్మ
ప్రకృతి మాతను కొలిచే దసరా
ఆట పాటల కేరింతలతో
పరవశాన పడతులు, పిన్నల
నృత్యాలతో కోలాటాలు కోలహాల నడుమ
సరదానిచ్చు దసరా. నిత్య సంతోషాలతో
చామంతులు, బంతులు తోరణాలతో
ఇంతుల కోలాహలము తో
కోరికలు తీర్చే శమీపూజలతో
ప్రకృతి పార్వతీ కాగా
దుష్టసంహారిణి దుర్గమ్మను భక్తితో కొలువగా చెడు
పై విజయం సాధించే రోజు
సహస్రనామార్చనలతో
నవ విధనివేదనలతో భజన లతో భక్తితో ముక్తితో
దసరా పండుగ సంబరాలు అంబరాన్ని తాకే
మహిషాసుర మర్ధినితో.....

-గాయత్రి చిరుమామిళ్ళ
నందిగామ

## భక్తి పూర్వకం

మనిషిని మనిషిగా వ్యవహారింపచేయునవి పండుగలు!
ఆత్మీయతానురాగాలను
మమతానుబంధాలను పెంపొందించునవి పండుగలు!
హిందూ సంప్రదాయ ఔన్నత్యాన్ని
ఇనుమడింపజేయునది పండుగలు!
తారతమ్యభేధములను రూపుమార్పునది పండుగలు!.
ఆధ్యాత్మికత, నవరసాల సమ్మేళనం దసరా!
ఆశ్వయుజ శుక్లపాడ్యమి మొదలు
నవమి వరకు నవరాత్రులు!
నవరాత్రి ఉత్సవాలలో పార్వతీదేవికి రోజుకొక అలంకరణ!
వీటితోపాటు బతుకమ్మ, నవదుర్గలు, పార్వతి వేషధారణలు!
అమ్మవారి విశిష్ట వివిధ అలంకరణా రూపాలు!
శైలపుత్రి,బ్రహ్మాచారిని, చంద్రఘంటాదేవి,
కుష్మాండ దేవి, స్కందమాత, కాత్యాయిని,
కాలరాత్రి,మహా గౌరీ, సిద్ధి ధాత్రి దేవి!
క్రొత్త వధూవరులకు కానుకగా
క్రొత్త బట్టలిచ్చి సత్కరింపు!.
చివరి రోజున ఉత్సవంగా
అమ్మవారు వెళ్లి రాక్షస సంహార ఘట్టం!
దసరా సంబరాలు
అంగ రంగ వైభవంగా వేడుకలు!
భక్తిశ్రద్ధలతో, తన్మయత్వంలో అమ్మవార్లను
పూజించి పరవశులయ్యేరు!
మనిషికి మనిషి మధ్య మమతాను రాగాలు
పెంచడంలో దసరా సంబరాల
పాత్ర ప్రత్యేక ఘట్టం...!!!

- క్రిష్టంశెట్టి సుబ్బారావు
9490747939.

## విశ్వ సాహిత్య చక్రవర్తి

ప్రపంచ సాహితీవేత్త గురజాడ
ఈనాటికి ఎందరో సాహితీవేత్తలకు
అడుగు జాడ
గిడుగు రామ్మూర్తి కి తోడు నీడ
గజపతుల వద్ద కొలువుదీరాడు
మహారాజ కళాశాల లో ఆంగ్ల అధ్యాపకుడు
స్వగృహం గా విజయనగరం లో
వెలసింది మేడ
అభ్యుదయ కవితా పితామహుడు
పుత్తడి బొమ్మ పూర్ణమ్మ తో
బాల్య వివాహలపై గురిపెట్టిన విలుకాడు
కన్యాశుల్కమ్ రచనతో
మూఢ చారాలను ఎండగట్టిన మొనగాడు
ముత్యాలసరాలతో తెలుగులో
తేనె లొలికించాడు
జానపదుల జావలిలా
నీలగిరి పాటలు వినిపించాడు
దేశమంటే మట్టి కాదని
దేశమంటే మనుషులోయ్ అని
ఎలుగెత్తి చాటాడు
నవయుగ వైతాళికుడిగా
కీర్తి ప్రతిష్ట లు మూటగట్టాడు
సాంఘిక దూరచారాలను
ధైర్యంగా ఎదుర్కొన్నాడు
స్వాతంత్ర్య సమరంలో
తన పాత్ర పోషించాడు
ఇటాలీయాన్ అఫ్ ఈస్ట్ తెలుగనిపించాడు
ఆధునిక కవి రారాజు అనిపించాడు
విశ్వ విఖ్యాత గాంచిన
కవి శేఖరుడు గురజాడ!!

-మరువాడ భానోజీ,
9014404717

## 'మనోవిహారి' కవితా సంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హైదరాబాద్, అక్టోబర్ 8: (నేటినిజం ప్రతినిధి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ అనువాద రచయిత కస్తూరి రాజశేఖర్ రచించిన **'మనో విహారి'** కవితా సంపుటి ఆవిష్కరణ శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. ఎస్‌బీహెచ్ పూర్వ సీజీఎం సి. దినకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించి మాట్లాడారు. రెండున్నర దశాబ్దాలుగా అనువాద రంగంలో తనదైన శైలిలో అందరికి అర్థమయ్యే విధంగా రచనలు అనువదించి పాఠకుల మన్ననలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు సి.మోహన్, వెంకటకృష్ణ మూర్తి, నాగేశ్వరరావు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ మార్గం అనుసరణీయం

హైదరాబాద్, అక్టోబర్ 8: (నేటినిజం ప్రతినిధి): జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గం అనుసరణీయమని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతిశర్మ అన్నారు. త్యాగరాయ గానసభ నిర్వహణలో కళా లలిత వేదికలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అహింసా సత్యాగ్రహాలనే ఆయుధాలుగా మార్చుకొని దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు.

బ్రిటిష్, పాలకుల బానిస సంకెళ్ల నుంచి దేశ ప్రజానీకానికి విముక్తిని కల్పించిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు జయసూర్య, వెంకట రమణ, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



సభలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతీశర్మ, జయసూర్య, కళా జనార్ధనమూర్తి తదితరులు.

## ఆకట్టుకున్న ఆధ్యాత్మిక గీతాల గానం

హైదరాబాద్, అక్టోబర్ 8: (నేటినిజం ప్రతినిధి): దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా సాంస్కృతిక వేదిక రామ్‌కుమార్ కళారవిందం ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ భక్తిగీతాల విభావరి ఆకట్టుకుంది. గాయనీ గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావుకు వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు విశ్వనాథ్, రామ్‌కుమార్, రేణుక, కృష్ణవేణి, శ్రీమణి, అనురాధ, భార్గవి పాల్గొన్నారు.



త్రినాథరావును సన్మానించిన వంశీ రామరాజు

## చుక్కా రామయ్యకు పద్మ విభూషణ్ ఇవ్వాలి- జూలూరు గౌరీశంకర్

హైదరాబాద్, అక్టోబర్ 8: (నేటినిజం ప్రతినిధి): స్వాతంత్ర్య సమరయోధుడు చుక్కా రామయ్యకు కేంద్ర సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. వేలాదిమంది ఐఐటీలను తయారుచేసి దేశానికి, ప్రపంచానికి అందించిన చుక్కారామయ్య రెండు తెలుగు రాష్ట్రాలు గర్వించదగ్గ వ్యక్తి అని పేర్కొన్నారు.

గాంధీ 156వ జయంతి సందర్భంగా గాంధేయవాది, రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన 'గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మాగాంధీ' పుస్తకాన్ని చుక్కారామయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ అమెరికాలోని సిలికాన్ వాలీ తెలుగు విద్యార్థులతో నిండిపోవడానికి కారకుడు రామయ్యే అన్నారు. పుస్తక రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ గాంధీ వ్యక్తిత్వం, ఆయన ఆలోచనలు, ఆచరణ, తాత్త్వికత నేటి కాలానికి ఎంత అవసరమో **గ్లోబల్ రోల్ మోడల్ గాంధీ** పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లికేషన్స్ వ్యవస్థాపకుడు కోయ చంద్రమోహన్, రామానంద తీర్థ గ్రామీణ విద్యాసంస్థ చైర్మన్ నారా కిషోర్‌రెడ్డి, రామయ్య తనయుడు సైంటిస్ట్ చుక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



'గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మాగాంధీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చుక్కా రామయ్య, జూలూరు గౌరీశంకర్ తదితరులు.

